క్లుప్తంగా

కాజీపేటలో ఉచిత కంటి వైద్యశిబిరం



కాజీపేట రూరల్ : కాజీపేటలోని శ్రీ రవి నర్సింగ్ హోమ్ కంటి హాస్పిటల్ (డాక్టర్ విశ్వనాథరావు)లో మంగళవారం కాజీపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు సుస్మిత, సిరిగిరి రాణిలు, వైద్య సిబ్బంది శిబిరానికి వచ్చిన 125 మంది పేషెంట్లకు బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో కంటి పరీక్షలు చేసి ఆపరేషన్ అవసరమున్న వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆపరేషన్లు అవసరం లేని వారికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్పొరేటర్ జక్కుల రమ రవీందర్‌యాదవ్, వైద్య సిబ్బంది, లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత పైల్స్ శిబిరం

కాశిబుగ్గ : వరంగల్ బస్టాండ్ సమీపంలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో బుధవారం ఉచిత పైల్స్, ఫిస్టుల్లా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మంగళవారం శల్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ పైల్స్‌డే సందర్భంగా శల్యతంత్ర విభాగం, జండు ఆయుర్వేద కంపెనీ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా పరీక్షించి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



హసన్‌పర్తి : హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ఇందిర శక్తి విజయోత్సవ సభకు మండలం నుంచి భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. మండల కేంద్రం నుంచి ఆటో ర్యాలీ నిర్వహించారు. తరలిన వారిలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, గద్దం శివ రాంప్రసాద్, పొన్నాల రఘు, మణీందర్‌నాథ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్‌లు జె.రవి,శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

క్రీడాకారులకు సన్మానం



కాజీపేట : పట్టణంలో పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాజీపేటకు చెందిన పోలు శ్యాంసుందర్, కుక్కల ఉమాసాయి, మహమ్మద్ జాఫర్‌లు వివిధ అంశాల్లో జరిగిన పోటీల్లో రాణించి బంగారు పతకాలు దక్కించుకున్నారు. డిసెంబర్ 7 నుంచి 12 వరకు హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే సౌత్ ఇండియా ఈవెంట్‌కు అర్హత సాధించారు. క్రీడాకారులను బీజేపీ జిల్లా నాయకులు మేకల కేదారి యాదవ్ సన్మానించారు. కార్యక్రమంలో ఉడుతల బాబురావు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

దేశాయిపేట : వరంగల్ తూర్పు నాయీబ్రాహ్మణ సంఘంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నాయకుడు మేడిపల్లి కరుణాకర్ అన్నారు. తూర్పు నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు మంగళవారం నామినేషన్ వేసిన కరుణాకర్ ప్రచారం నిర్వహించారు. విజయ్‌కుమార్, బాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న డబ్బులు అప్పగింత

హన్మకొండ చౌరస్తా : పోగొట్టుకున్న డబ్బులను బాధితులను గుర్తించి తిరిగి అప్పగించి శభాష్ పోలీస్ అనిపించుకున్నాడు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువుల కోసం మంచిర్యాలకు చెందిన జంగాల సురేశ్ ఆదివారం ఆస్పత్రికి వచ్చాడు. రాత్రి నిద్రించిన సమయంలో తన జేబులోని రూ.3500లు అక్కడే పడిపోయాయి. అది గుర్తించని సురేష్ వెళ్లిపోయాడు. అయితే ఆస్పత్రిలో విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావు రాత్రి పెట్రోలింగ్‌లో భాగంగా ఆస్పత్రి లోపల డబ్బులను గుర్తించాడు. సోమవారం సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, బాధితులను గుర్తించాడు. హెడ్‌కానిస్టేబుల్ గోపితో కలిసి బాధితుడు సురేశ్‌కు డబ్బులను అప్పగించాడు.

మురుగునీటి గుంతలతో ఇబ్బందులు

- కాజీపేటలో దోమల స్వైరవిహారం
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కాలనీ మధ్యలో మురుగునీటి గుంత

కాజీపేట: మురుగునీటి గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య నివారణ చర్యలు శూన్యం కావడంతో కాజీపేటలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. చీకటి పడుతుందంటే చాలు ఇళ్లలోకి వందల సంఖ్యలో దోమలు ప్రవేశిస్తూ ప్రజలకు చికాకు కలిగిస్తున్నాయి. దోమకాటుకు గురైన వృద్ధులు, పిల్లలు అనారోగ్యాలకు గురవుతూ ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దోమలను అరికట్టేందుకు మురుగు కాల్వల్లో రసాయనాలు చల్లటం, సంహరించేందుకు రాత్రి వేళల్లో ఫాగింగ్ చేయటం వంటివి చేయాలి. ఏడాది కాలంగా ఫాగింగ్ తదితర నివారణ చర్యలు లేనందున దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు వినియోగించకపోవడంతో అవి కార్యాలయ ఆవరణలో మూలనపడి ఉన్నాయంటున్నారు. పొడి, తడి చెత్తలతో ముందుకు సాగాలని అధికారులు ఆదేశించినా పనుల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని వాపోతున్నారు. సాధారణ మురికి కాల్వలతో పాటు రైల్వే కాలనీల నుంచి వచ్చే మురుగునీరు బయటకు వెళ్లే మార్గంలేక దోమలు వృద్ధి చెందుతున్నాయి. మస్కిట్ కాయిల్స్, ఎలక్ట్రిక్ బ్యాట్లు కొనుగోలు చేస్తున్నా దోమలు అదుపులోకి రావడంలేదని వాపోతున్నారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే స్పందించి దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి



బస్‌స్టేషన్ జంక్షన్‌లో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆర్టీసీ కార్మికులు

వరంగల్ చౌరస్తా : ఆర్టీసీ కార్మిక సంఘాలపై 2019 డిసెంబర్ నుంచి విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ జంక్షన్‌లో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. సామాజిక భద్రత పథకాలకై పీఎఫ్, ఎస్ఆర్‌బీ, ఎస్‌బీటీ ట్రస్టులకు కార్మిక సంఘాల ప్రతినిధులను భాగస్వామ్యంతో బోర్డు ఆఫ్ ట్రస్టీలను నియమించి ప్రజాతంత్ర హక్కులను పునరుద్ధరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులందరూ డిపోల ఎదుట ఐక్యంగా ధర్నాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గున్నాల ప్రభాకర్, ఓదెలు, మూడేళ్ల ఉపేందర్, మీరు షాజియా, అప్పాజీ, వాణి, ఎండి ఇస్మాయిల్, మేకల సరిత ,రాఘవరెడ్డి ,జుబేదా సూరయ్య ,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల ముందస్తు అరెస్ట్



కేయూ పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



హన్మకొండ అర్బన్ : విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కేయూ క్యాంపస్: సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ పర్యటన నేపథ్యంలో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, పార్టీ యూత్ నాయకులు బి.వీరేందర్, కొమురయ్య, రాంమూర్తి, సూర్యకిరణ్, సుమన్, వీరస్వామి, రాజేష్ నయీమ్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రశాంత్, ఎంఎస్ఎఫ్ ఇన్‌చార్జ్ మధు, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి హాతీరాం అరెస్టయిన వారిలో ఉన్నారు.

హన్మకొండ అర్బన్ : కాళోజీ కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలు పెట్టకుండా, కళాకారుల పేరుతో నామకరణం చేయకుండా కళాక్షేత్రం ఆవిష్కరణ చేయవద్దని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను నిరసిస్తే విద్యార్థి సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. కళాకారుల విగ్రహాలు పెట్టేంత వరకు పోరాడుతామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో ఎస్ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్, టీఎస్ఎఫ్ గ్రేటర్ వరంగల్ సిటీ ప్రెసిడెంట్ సునీల్, శివ, సిద్దు, వంశీకృష్ణ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

హన్మకొండ: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, రాజు నాయక్, సీనియర్ నాయకుడు నయీముద్దీన్, సూర్య కిరణ్, వీరు, సుమన్, మనోజ్, సొరం రఘు, పిట్టల కల్యాణ్‌ను పోలీసులు అరెస్టు చేసి సుబేదారి, కేయూ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

అరెస్ట్‌లతో ఉద్యమాలు ఆపలేరు



ఖిలావరంగల్ : మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

ఖిలా వరంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హనుమకొండ పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్ట్‌లు చేసి ఉద్యమాలను ఆపలేరని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంగి ఎలేందర్ అన్నారు. మంగళవారం ఉదయాన్నే మిల్స్‌కాలనీ పోలీసులు దళిత హక్కుల పోరాట సమితి నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

స్వేరోస్ ఆందోళన

విద్యారణ్యపురి: హనుమకొండకు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు వచ్చి కాళోజి కళాక్షేత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉండగా మంగళవారం అదాలత్ సెంటర్ అమరవీరుల స్తూపం ప్రాంతంలోని పలువురు స్వేరోస్ ప్లకార్డులు చేతబూని దళితబంధు అమలుచేయాలని నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. నిరసన తెలియజేస్తుండగా అక్కడే ఉన్న పోలీసులు వెంటనే వారిని అదుపులోనికి తీసుకొని వాహనంలో ఎక్కించి అరెస్టు చేసి అక్కడినుంచి తరలించారు. సీఎం ఆ మార్గంలో ఇంకా రాకముందే స్వేరోస్ నిరసనకు దిగటంతో నిమిషాల వ్యవధిలోనే ఆందోళనకు దిగిన స్వేరోస్‌ను అరెస్టు చేశారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



హనుమకొండ డీసీసీ భవన్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కొండా సురేఖ, వేం నరేందర్‌రెడ్డి, వీహెచ్. హనుమంతరావు, ఎమ్మెల్యేలు, తదితరులు

దేశంలో అనేక సంస్కరణలు తెచ్చిన మహానేత ఉక్కు మనిషి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మంగళవారం పట్టణంలోని ఆయా డివిజన్లలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ విగ్ర హానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమాల్లో మంత్రి కొండా సురేఖ, మేయర్ సుధారాణి, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, డివి జన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు, పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



వరంగల్ చౌరస్తా : పూలమాల వేస్తున్న ప్రకాశ్



కాజీపేట అర్బన్ : కడిపికొండలో..



రామన్నపేట : కొత్తవాడలో..

నూతన విద్యావిధానం రద్దుకు పోరాడుదాం



కేయూ క్యాంపస్: పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో నూతన జాతీయ విద్యావిధానం రద్దు కోసం పోరాడుదామని డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ అన్నారు. డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కేయూలోని బాటనీ విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహించిన విద్యారంగ సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ అంశంపై సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల రాకతో ప్రభుత్వ విద్యారంగ నిర్వీర్యం అవుతుందన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలన్నారు. డీఎస్ఏ రాష్ట్ర కోకన్వీనర్లు గణేష్, శివలు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్ అధ్యక్షత వహించి మాట్లాడారు. డీఎస్ఏ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్‌పరం చేస్తున్న బీజేపీ



హసన్‌పర్తి : కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ పరం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవారెడ్డి మండిపడ్డారు. మండల కేంద్రంలోని ఎస్సీఆర్ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ శ్రీరాముడి పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

డిసెంబర్ 14, 15వ తేదీల్లో నిర్వహించ తలపెట్టిన పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని వాసుదేవారెడ్డి పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడి రాముల అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం నాయకులు గాదె ప్రభాకర్ రెడ్డి, కమిటీ సభ్యులు సుచేందర్, పుల్లా అశోక్, సతీష్, జూకంటి పద్మ, సుమన్, రజిత, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల గుడిలో సంకటహరచతుర్థి పూజలు

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో కార్తీకమాసం బహుళ చవితి మంగళవారం సంకటహరచతుర్థి పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గంగు మణికంఠశర్మ, అర్చకులు ఉదయం 5 గంటల నుంచి ప్రభాతపూజలు, శ్రీరుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. దేవాలయంలోని కాకతీయుల కాలంనాటి ఉత్తిష్టగణపతికి ఓం గం గణపతియేనమః అంటూ గణపతి సూక్తమూలమంత్రపఠనంతో పంచసూక్తులతో జలాభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం నవరస సుగంధ ద్రవ్యాలతో, హరిద్రా కుంకుమ జలాలతో అభిషేకాలు, గరికపూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉపకమిషనర్ శ్రీకాంతారావు, శ్రీనివాస రావు దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈఓ వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన సంకటహర చతుర్థి పూజలు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో కొలువుదీరిన అభయాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో మంగళవారం రాత్రి సంకట హర చతుర్థి ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో భక్తులతో కలిసి గణపతి హోమం జరిపించారు. గణనాథుడికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేసి వెండి తొడుగులతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసోత్సవ వేడుకలను పురస్కరించుకుని సహస్ర దీపాలంకరణ పూజలు చేశారు.

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు మంగళవారం కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వివిధ విభాగాల్లో ఫుల్‌వర్క్ లోడ్‌తో పనిచేస్తున్న అధ్యాపకులను మినిమం టైంస్కేల్‌కు మార్చాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని వీసీ వారితో అన్నారని కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ తెలిపారు. వీసీని కలిసిన వారిలో జనరల్ సెక్రటరీ నాగేశ్వర్‌రావు, మోహన్, కుమారస్వామి, లక్ష్మీనారాయణ, సాహితి, సుభాష్, లక్ష్మణ్ ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం



కరపత్రాన్ని విడుదల చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

- 26న జిల్లా కేంద్రంలో భారీ నిరసన ప్రదర్శన
- రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు

వరంగల్ చౌరస్తా : కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ 27వ డివిజన్ అబ్బనికుంటలోని రైతు భవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్లు సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, కార్మిక సంఘాల జిల్లా బాధ్యులు ముక్కెర రామస్వామి, గన్నారపు రమేష్, నర్ర ప్రతాప్, అక్కనపెల్లి యాదగిరి, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి, గుంగుల దయాకర్, కుసుంబ బాబురావు, మొగిలి ప్రతాపరెడ్డి సుధమల్ల భాస్కర్ ఇంద్రసేనారెడ్డి, ఎంఏ పాషా పాల్గొన్నారు. ఈ నెల 26న వరంగల్‌లో జరిగే భారీ నిరసన ప్రదర్శన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తూ ఉత్పత్తిలో ప్రధాన భూమిక పోషించే రైతులను కార్మికులను కూలీలు మార్చుతున్నారని విమర్శించారు. ప్రజలకు చెందాల్సిన సంపదను పెట్టుబడిదారులతో చేతులు కలిపి దోచుకుతింటున్నారని పేర్కొన్నారు. నియంతృత్వ పద్ధతుల్లో పాలన కొనసాగిస్తున్నారని అందుకని గత ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తక్కువ సీట్లు ఇచ్చి ప్రజలు గుణపాఠం చెప్పినా పరిస్థితుల్లో మార్పులు రాలేదన్నారు. సమావేశంలో కార్మిక రైతు సంఘాల నాయకులు కాసు మాధవి, సుంచు జగదీశ్వర్, మాలోత్ సాగర్, ఐతం నగేష్, ఓదేలు, హసీనా, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్రీయ సేవిక సమితి జిల్లా కార్యసహ కవిత, తదితరులు

విద్యారణ్యపురి: ఝాన్సీలక్ష్మీబాయి ఆంగ్లేయులపై పోరాడిందని, గుర్రం స్వారీ చేస్తూ ఎన్నో ఉద్యమాలు చేశారని ఇప్పుడున్న సమాజంలో ప్రతీ ఒక్క మహిళా ఝాన్సీలక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్రీయ సేవిక సమితి జిల్లా కార్యసహ కవిత కోరారు. మంగళవారం హనుమకొండలోని ఏబీవీపీ కార్యాలయంలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత దేశీయ సేవలో మొదటి మహిళా సమూహంను తయారు చేసినప్పుడు దానికి ఆమె పేరు పెట్టారన్నారు. భారత దేశ కవయిత్రి సుభద్రకుమారి చౌహాన్ వీర రసశైలిలో ఆమె గురించి ఒక కవితను రచించారన్నారు. మహిళలు ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకొని ముందుండాలని కోరారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సాహసి పేరుమీద మహిళలకు సెల్ఫ్‌డిఫెన్స్ కార్యక్రమాలు చేస్తూ విద్యార్థినులు అన్నిరంగాల్లో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర అధ్యక్షుడు సంపత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోడ బిందు, జిల్లా కన్వీనర్ ఆరెపెల్లి సుజిత్, నగర కార్యదర్శి తాళ్లపెల్లి అరుణ్, రేవంత్, రోహిత్ పాల్గొన్నారు.



సీఎంకు ఘన స్వాగతం

జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి హనుమకొండకు వచ్చారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద హెలీప్యాడ్ వద్ద సీఎంకు ఘనస్వాగతం పలికారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డికి హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ జ్ఞాపికలు అందజేశారు.



